రాష్ట్రస్థాయిలో నైపుణ్యం చూపాలి

ఎంపికైన జట్టును అభినందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కెరమెరి, డిసెంబర్ 24 : జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లోనూ క్రీడాకారులు నైపుణ్యం చూపాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం సూచించారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన సీఎం కప్ ఆటల పోటీల్లో కెరమెరి మండలానికి చెందిన కబడ్డీ జట్టు ఉత్తమ ప్రతిభ చూపి, ప్రథమ స్థానంలో నిలిచింది. కాగా, క్రీడాకారులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టుదల, క్రీడా మెలకువలు పాటిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ అబ్దుద్‌పాషా సిబ్బందితో కలిసి క్రీడాకారులను అభినందించారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దహెగాం, డిసెంబర్ 24 : దహెగాం మండల కేంద్రంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యుడు శ్రీనివాస్ తెలిపారు. బెల్లంపల్లి, హైదరాబాద్ కేర్ గ్రూప్‌లు సంయుక్తంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 45 మందికి ఆపరేషన్ అవసరమవగా, రెఫర్ చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు మెరుగు సిద్దుగౌడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, చిలురు కమలాకర్, కంబగౌని సంతోష్‌గౌడ్, పుప్పాల సంతోష్, గందె వెంకటేశ్, కాసారపు నగేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ క్లినిక్ ప్రారంభం

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో అసంక్రమణ వ్యాధులకు (ఎన్‌సీడీ) సంబంధించి చికిత్స అందించేందుకు వీలుగా క్లినిక్, వైద్య సేవలను డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ మంగళవారం ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక కేంద్రాల ద్వారా పంపబడిన కేసులను ఫిజీషియన్ ద్వారా కౌన్సెలింగ్, పరీక్షలు చేసి మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఫిజీషియన్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భీష్మ, అశోక్, ప్రసాద్, అసంక్రమణ వ్యాధుల పీవోలు లింగారెడ్డి, లక్ష్మణ్, డెమో బుక్క వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

మహాసభలో పాల్గొననున్న కవులు మహేందర్, రామస్వామి, రాజమల్లు

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 24 : విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరుగనున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు చెన్నూర్ కవులకు ఆహ్వానం లభించింది. చెన్నూర్ కవిత్వయంగా పేరుగాంచిన మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డు మహేందర్, మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లుకు ఆహ్వానం అందినట్లు వారు తెలిపారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాల్లో కవి సమ్మేళనంతో పాటు, సాహితీ సంస్థల సదస్సులో ప్రత్యేకంగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. చెన్నూర్ సాహిత్య గొంతుకకు ప్రపంచ వేదికపై అవకాశం లభించడంపై ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, రామ్మూర్తి, చిల్కూరి శ్రీనివాస్, మామిడి అక్షిత, సునీల్, తదితరులు అభినందనలు తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్ విద్యార్థులు

నస్పూర్, డిసెంబర్ 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల అల్ఫోర్స్ స్మార్ట్ స్కూల్‌లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పండుగల ద్వారా సంతోషం వెల్లివిరుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చైనామాంజా విక్రయిస్తే చర్యలు

దండేపల్లి, డిసెంబర్ 24 : చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. దండేపల్లి మండలంలోని మేదరిపేట కిరాణా దుకాణాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. చైనా మాంజా దారంతో మనుషులు, పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ రేంజ్ అధికారులు పోచమల్లు, ఎఫ్ఎస్‌వో శేషారాం, ఎఫ్‌బీవోలు శ్రవణ్ ఉన్నారు.

చైనామాంజాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎస్సార్పీ 3 గని మేనేజర్‌కు టీబీజీకేఎస్ కమిటీ సభ్యుల వివరాలు ఇస్తున్న ఉపాధ్యక్షుడు లక్ష్మణ్

ఆర్కే న్యూటెక్ గని మేనేజర్‌కు వివరాల పత్రం అందిస్తున్న నాయకులు

ఎస్సార్పీ 3, ఆర్కే 7ఏ న్యూటెక్
టీబీజీకేఎస్ కమిటీల నియామకం

- తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి
- గని మేనేజర్లకు పరిచయం

శ్రీరాంపూర్, డిసెంబర్ 24 : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఎస్సార్పీ 3, ఆర్కే న్యూటెక్ గనుల కమిటీల సభ్యులను ప్రధాన కార్యదర్శి కే సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ గనుల మేనేజర్లకు పరిచయం చేశారు. వారి పూర్తి వివరాల పత్రాలను మేనేజర్లు స్వామిరాజు, వెంకట్రావ్‌కు అందజేశారు. ఎస్సార్పీ 3 గని టీబీజీకేఎస్ చీఫ్ అడ్వైజర్‌గా సాధుల భాస్కర్, పిట్ కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా టీ నరేశ్, షిఫ్ట్ ఇన్‌చార్జులుగా సుభాష్, జే తిరుపతిరెడ్డి, జీ గంగాధర్, సునిల్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గోపతి మల్లేశ్, అల్లం రాజయ్య, టీ శ్రీనివాస్, కోశాధికారిగా ఎండీ సల్మాన్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ఏ పవన్‌కళ్యాణ్‌ను నియమించారు. అలాగే ఆర్కే 7ఏ న్యూటెక్ గని పిట్ కార్యదర్శిగా ఉప్పాల సంపత్, సహాయ కార్యదర్శిగా టీ జయపాల్‌రెడ్డి, షిఫ్ట్ ఇన్‌చార్జులుగా అడ్లూరి అనిల్, సందీప్ గౌడ్, దేవేందర్, రాజ్‌కుమార్, జయకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జీ రాజు, సీహెచ్ గోపాల్, కార్యవర్గ సభ్యులుగా దినకర్, తలారి రవి, భీమ్‌రావ్, ఎం శ్రీనివాస్, కే సుధాకర్, భగవాన్, కంచర్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, కే శ్రీకాంత్‌ను నియమించగా, వీరిని పరిచయం చేశారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలోనే సింగరేణి కార్మికులకు అన్ని విధాలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని నమ్ముతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ వల్లే తమ పిల్లలకు కారుణ్య ఉద్యోగాలు దొరుకుతున్నాయని కార్మికులు గర్వంగా చెప్పుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర సంయుక్త కార్యదర్శి పానగంటి సత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపీనాయక్, ఎండీ లాలా, ఉత్తేజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ
- మోడీ కేజీబీవీ, కెరమెరి అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కెరమెరి, డిసెంబర్ 15 : గుణాత్మకమైన చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపైనా నిత్యం పాఠశాలల సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. కెరమెరి మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. మోడీ కేజీబీవీ, కెరమెరి అంగన్‌వాడీ కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే, కేజీబీవీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం–1లో పిల్లలు, బాలింతలు, గర్భిణుల వివరాలు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కేజీబీవీలో కోతుల కారణంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి, వాటర్ హీటర్లకు మరమ్మతులు చేయించాలని ఎంఈవోకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న కేజీబీవీ కళాశాలపై వివరాలు తెలుసుకొని వెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి అబ్దుద్‌పాషా, తహసీల్దార్ దత్త ప్రసాదరావు, ఎంఈవో ఆడే ప్రకాశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

మౌలిక వసతులు కల్పించాలి..

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 24 : అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పీవీటీజీ గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, సీడీపీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

నస్పూర్, డిసెంబర్ 24 : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్ డిమాండ్ చేశారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. కేంద్ర మంత్రి పదవీలో ఉండి అంబేద్కర్ గురించి హేళనగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు రాజేంద్రప్రసాద్, కిరణ్, రాములు, రాజేశ్, తిరుపతి, ప్రణయ్, మల్లయ్య, విజయ్‌కుమార్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్ : కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

మందమర్రి, డిసెంబర్ 24 : బాధ్యత గల పదవిలో ఉండి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. మంద మర్రి మార్కెట్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కేంద్ర మంత్రి అమిత్‌షా వాఖ్యలపై నిరసన తెలిపారు. నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, కడారి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, డిసెంబర్ 24 : లక్షెట్టిపేటలోని ఊర్కొండ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంపీ వంశీకృష్ణ నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మాట్లాడారు. నాయకులు గరిసె రవీందర్, పెండెం రాజన్న, మినుముల శాంతికుమార్, బైరం రవి, దొంత నర్సయ్య, సత్తయ్య, వేముల ప్రేమ్‌సాగర్, దమ్మ సునీల్, తొగరి రాజు, ప్రసాద్, వేణు తదితరులున్నారు.

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 24 : కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల ఐబీ రస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ వైర్మన్ కోట్నాక తిరుపతి, మున్సిపల్ వైస్ వైర్మన్ సల్ల మహేశ్, టీసీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, నాయకులు తూముల నరేశ్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.

సీబీఐ విచారణ చేయాలి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 24 : కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అవినీతిపై సీబీఐ ద్వారా విచారణ జరిపించి, బొగ్గు గని కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గోదావరిఖనిలో ఫిబ్రవరి 22, 23న జరిగే యూనియన్ 19వ త్రైవార్షిక మహాసభలకు సంబంధించి వాల్‌పోస్టర్లను మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా యూనియన్ కార్యాలయంలో విడుదల చేశారు. మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నాతాడి శ్రీధర్‌రెడ్డి, రాగం రాజేందర్, జీడీ ప్రభాకర్, గూడ శ్రీకాంత్, పురుషోత్తమాచారి, జల్ల తిరుపతి, గొల్ల మహేందర్, గోనె రామకృష్ణ, సామాల కిషోర్, కుంట రాజు, చల్ల శ్రీనివాస్, విజయ్‌కుమార్, కుమ్మరి చందు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్ష సందర్శన

నస్పూర్, డిసెంబర్ 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని మంగళవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అలాగే నస్పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దీక్షను సందర్శించి, మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పోడేటి సంజీవ్, భుజంగరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 24 : ఎంఎల్ఎస్ పాయింట్ అధికారుల నిర్లక్ష్యంతో రేషన్ డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోటపలుకుల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బొమ్మ సత్యనారాయణ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుదమల్ల కృష్ణ డిమాండ్ చేశారు. నస్పూర్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం ఇన్‌చార్జి శంకర్‌కు మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్, మంచిర్యాల, హాజీపూర్, జైపూర్, మందమర్రి మండలాల రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ ప్రవేశాల గడువు పెంపు

కౌటాల, డిసెంబర్ 24 : ఓపెన్ టెన్త్‌లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు గుండాయిపేట అధ్యాయన కేంద్ర కోఆర్డినేటర్ గోడం నానాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత చదువులు చదువాలనే వారికి సువర్ణావకాశమని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో కలువాలని ఆయన సూచించారు.

నష్టపరిహారం అందజేత

నష్టపరిహారం అందజేస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 24 : చిరుత దాడిలో మృతి చెందిన ఆవుకు సంబంధించి యజమాని అప్పన్నకు అటవీశాఖ అధికారులు రూ.25వేల పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ మాట్లాడుతూ.. మాణిక్ గూడ వద్ద గల అర్బన్ పార్క్ వెనుకాల సోమవారం సాయంత్రం అప్పన్నకు చెందిన ఆవు చిరుత దాడిలో మృతిచెందిందన్నారు. ఈ మేరకు పరిహారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, బీట్ అధికారులు రాజేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

పశువుల వాహనం పట్టివేత

పట్టుబడిన పశువుల వాహనం వద్ద పోలీసులు

రెబ్బెన, డిసెంబర్ 24 : మహారాష్ట్రలోని గడ్‌చందూర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని మంగళవారం పట్టుకున్నట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెనలోని ఎన్‌హెచ్–363 హైవే వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, షేక్ షబ్బీర్, షేక్ అఫ్తాబ్ బొలేరో వాహనంలో అక్రమంగా ఏడు ఎడ్లు, మూడు ఆవులు తరలిస్తూ పట్టుబడ్డారు. రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న టీఎన్జీవో సభ్యత్వనమోదు

సభ్యత్వాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

హాజీపూర్, డిసెంబర్ 24 : జిల్లాలో తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సభ్యత్వ నమోదు కొనసాగుతున్నది. జిల్లా కేంద్రంలోని మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఉద్యోగీ టీఎన్జీవో సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్ తదితరులున్నారు.

సొంతింటి కల నెరవేరేదాక పోరాడుతాం

శ్రీరాంపూర్, డిసెంబర్ 24 : సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరేదాకా పోరాడుతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే 5గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం కార్మికులను వివిధ రకాలుగా వేదింపులు పెట్టడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, గని పిట్ కార్యదర్శి చిగురు లక్ష్మణ్, నాయకులు వెంకట్‌రెడ్డి, సదానందం, నరేశ్, శ్రీనివాస్, వెంకటేశ్, సురేందర్ పాల్గొన్నారు.

పెరియార్ 51వ వర్ధంతి సభ

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 24 : ప్రముఖ తమిళ సామాజిక వేత్త రామస్వామి పెరియార్ 51వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ బహుజన సంఘాలు నివాళులర్పించాయి. వందేళ్ల కిందటే బీసీ, నిమ్న వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన పోరాడారని గుర్తు చేశారు. తమిళనాడులో అమలులో ఉన్న ద్రావిడ మోడల్ దేశానికి ఆదర్శమని కొనియాడారు. నాయకులు మాడిశెట్టి సత్యనారాయణ, కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేశం, దేవి పోశం, మోతే రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 24 : క్రిస్మస్ పండుగ, జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు అధికంగా ఉండడంతో 29వ తేదీ వరకు జిల్లాలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రంలో వడ్ల దొంగతనం

- బాధిత రైతుల ఆవేదన

భీమారం, డిసెంబర్ 24 : మండల కేంద్రంలోని పెట్రోల్ పంప్ వద్ద గల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తమ వడ్ల నుంచి 8 క్వింటాళ్లు దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు దారవేణి తిరుపతి, తౌర్య నాయక్ వాపోయారు. నాలుగురోజుల క్రితం మాయిచ్చర్ వచ్చిందని, నిర్వాహకులు రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోలు చేశారని తెలిపాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నాలుగు క్వింటాళ్లు దొంగిలించారని పేర్కొన్నాడు. నిర్వాహకులు అక్కడ వాచర్‌ను పెట్టాల్సి ఉండగా, నిర్లక్ష్యం వహించారని ఆరోపించాడు.

ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జూర్, డిసెంబర్ 22 : మండలంలోని అందుగులగూడ గ్రామానికి చెందిన విద్యార్థి వెంకటలక్ష్మి ఇటీవల మృతిచెందగా, మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కొప్పుల శంకర్, మెప్రం రాజారాం, దాగం పాపయ్య, సామల తిరుపతి, భిక్షపతి, బాలకృష్ణ తదితరులు నాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నర్‌గా శ్రీయన్ని

నస్పూర్, డిసెంబర్ 24 : బెంగళూరులో జరిగిన సీనియర్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి, మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన శ్రీయన్ని రన్నర్‌గా నిలిచిందని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, టీం మేనేజర్ పుల్లూరి సుధాకర్ తెలిపారు. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా క్రీడాకారిణి దేవిక సిహాగ్‌తో తలపడి, ఓడిపోయిందని పేర్కొన్నారు. శ్రీయన్నిని ఆయన అభినందించారు.

పెరిగిన హమాలీ రేట్ల జీవో విడుదల చేయాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 1 : పెరిగిన సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల జీవో వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బియ్యం గోదాం ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవోను విడుదల చేయకుండా కాలయాపన చేస్తే జనవరి 1వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. గత ఒప్పందం ప్రకారం వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త రేట్ల ఒప్పందం జరుగాలన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాండూర్, డిసెంబర్ 24 : తాండూర్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మంగళవారం రేచిని గ్రామంలో బీటీ, సీసీ రోడ్లు, తాండూర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల, డిసెంబర్ 24 : మండలంలోని కుష్నపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి తిరుపతి రెడ్డి తండ్రి ముత్తయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఎమ్మెల్యే వినోద్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గట్టు మల్లేశ్, తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'కోతులు పట్టేందుకు ఎమ్మెల్యే డబ్బు ఇవ్వలేదు'

భీమారం, డిసెంబర్ 24 : భీమారం మండల కేంద్రంలో కోతులను పట్టేందుకు ఎమ్మెల్యే వివేక్ డబ్బు మంజూరు చేయలేదని, ప్రజలు, స్థానికులు, దాతలే సహకరిస్తున్నారని గ్రామీణ చైతన్య సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి రాజన్న యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.1.50 లక్షలు మంజూరు చేసినట్లు కొందరు కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను అడిగితే నిధులు రాలేదని స్పష్టం చేశారని తెలిపారు. యువకులు బోయిని శ్రీనివాస్, బబ్లూ, చింతం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రెబ్బెన, డిసెంబర్ 24 : బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్ కార్మిక కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి కోరారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో గల సివిల్ డిపార్ట్‌మెంట్‌లో సివిల్ ఎస్ఈ మదీనా బాషాకు సమస్య వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే కిరణ్‌బాబు, జీఎం కమిటీ సభ్యులు అనంద్, మారం శ్రీనివాస్ ఉన్నారు.

లేగ దూడపై పెద్ద పులి దాడి !

తాండూర్, డిసెంబర్ 24 : తాండూర్ మండలం నిలాయి పల్లి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం లేగ దూడపై పెద్ద పులి దాడి చేస